# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం 05 ఫిబ్రవరి 2025 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 8




## చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఏరియాలో
# భారీ అగ్ని ప్రమాదం

ఎగిసిపడుతున్న మంటలు

అదుపులోకి రాని పరిస్థితులు

భయాందోళనలో ప్రజలు

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి4,(నినాదం న్యూస్): హైదరాబాద్ చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఏరియాలో రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. కెమికల్ కంపెనీలో రసాయనాలు పేలి భారీగా మంటలు ఎగిసి పడుతున్నాయి. ఏరియా మొత్తం పొగతో కమ్ముకొని చుట్టు పక్కల కాలనీలు వాసనతో ఊపిరి ఆడని పరిస్థితులు నెలకొన్నాయి. ఫైర్ సిబ్బంది అక్కడి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగు ఐదు కీలో మీటర్ల మేర ప్రజలు మాత్రం భయాందోళనలో ఉన్నారు. రాత్రి తొమ్మిది గంటల సమాయని మంటలు అదుపులోకి రాలేదు. అక్కడి పటిస్థితులపై పూర్తి సమాచారం ఇంకా రావాల్సి ఉంది.





## చిన్న మధ్య తరహా పత్రికలను..
# ప్రభుత్వం గుర్తించాలి

- కమీషనర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి
- డిఎంఏసీ మెంబర్ తొలగింపు ఉత్తర్వులను రద్దు చేయాలి
- సానుకూలంగా స్పందించిన కమీషనర్ హరీష్

**మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** రాష్ట్రంలో ఏళ్ళ తరబడి నిరంతరంగా నడుస్తున్న చిన్న, మధ్య తరహా పత్రికలను ప్రభుత్వం ఎంప్యానల్మెంట్ జాబితాలో చేర్చి గుర్తించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ పద్మనాభరావు,కుంచెం శ్రీనివాస్ తదితరులు మంగళవారం సచివాలయంలో రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ ఎస్.హరీష్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వాలు చిన్న, మధ్య తరహా పత్రికలకు ఎటువంటి ప్రోత్సాహం ఇవ్వకుండా అన్యాయం మిగతా2లో

## అమ్మవారి ఆశీస్సులు
# అందరిపై ఉండాలి

పెద్దమ్మతల్లి జాతర వార్షికోత్సవంలో

పాల్గొన్న భీమ్ భరత్



**చేవెళ్ల, ఫిబ్రవరి 04 (నినాదం న్యూస్):** పెద్దమ్మతల్లి చల్లని ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని చేవెళ్ల అసెంబ్లీ ఇన్చార్జి పామేన భీమ్ భరత్ అన్నారు. మంగళవారం చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండలం జన్వాడ గ్రామంలో ఘనంగా జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి జాతర మూడవ వార్షికోత్సవ మహెూత్సవంలో చేవెళ్ల మిగతా2లో

# ములుకనూరు మహిళా డెయిరీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్

**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 04 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు మహిళా సహకార డెయిరీలో 'గడ్డి విత్తనాల ఉత్పత్తి' పై వర్క్ షాప్ నిర్వహించారు. డెయిరీ అధ్యక్షులు బుర్ర ధనశ్రీ అధ్యక్షతన, జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గడ్డి విత్తనాల ఉత్పత్తిలో అధిక దిగుబడి మిగతా2లో





## అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

(మొదటి పేజీ తరువాయి..)

అసెంబ్లీ ఇన్చార్జ్ పామేన భీమ్ భరత్ పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి చల్లని ఆశీస్సులు దీవెనలు ప్రజలందరి పైన ఉండాలని ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారుని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో శంకర్పల్లి మండలం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జన్వాడ గ్రామ మాజీ ఎంపీటీసీ మైసయ్య ముదిరాజ్ సంఘ వైస్ ప్రెసిడెంట్ మన్నెం వెంకటేష్ బైగల రాములు శ్రీశైలం, ఆలయ కమిటీ నిర్వాహకులు ఆలయ కమిటీ చైర్మన్ బైగల రాజు, వైస్ చైర్మన్ కొండకల్ మహేందర్ సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ములుకనూరు మహిళా డెయిరీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్







(మొదటి పేజీ తరువాయి..)

సాధించడానికి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఫీల్డ్ విజిట్ లో భాగంగా విత్తన పంట క్షేత్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సైంటిస్టులు డా. హెచ్ఎస్ జాట్, డా. భూపేంద్ర కుమార్, సునీల్ కుమార్, సీడ్స్ ప్రొడక్షన్ అసిస్టెంట్ మేనేజర్ దీప బేనివాల్, రైతులు, డెయిరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న మధ్య తరహా పత్రికలను ప్రభుత్వం గుర్తించాలి

(మొదటి పేజీ తరువాయి..)

చేస్తున్నాయని, ప్రభుత్వం నుంచి అడ్వర్టయిజ్మెంట్స్, సబ్సిడీలు లేక ఏళ్ళతరబడి నడుస్తున్న అనేక పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. జర్నలిజం వృత్తిని నమ్ముకున్న అనేక మంది సీనియర్ పాత్రికేయులు చిన్న, మధ్య తరహా పత్రికలు నడుపుతున్నారని, అలాంటి వారికి ప్రభుత్వం గుర్తింపు లేక ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. సీనియారిటీ, రెగ్యులారిటీ ఉన్న పత్రికలను ఎంప్యానెల్మెంట్ జాబితాలో చేర్చకుండా కొన్నేళ్లుగా పెండింగ్‌లో పెట్టి ఈ మధ్య కాలంలో వచ్చిన పత్రికలను ఎంప్యానల్ లో పెట్టి ప్రోత్సాహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలా చేయడం ప్రభుత్వానికి తగదని వారన్నారు. అర్హత ఉన్న అన్ని పత్రికలను ప్రభుత్వం గుర్తించాలని వారు కమీషనర్‌ను కోరారు. దీనిపై కమీషనర్ స్పందిస్తూ, అర్హత ఉన్న చిన్న,మధ్య తరహా పత్రికలను త్వరలో ఎంప్యానల్మెంట్‌లో చేరుస్తామని చెప్పారు. రెండు మూడు రోజుల్లో రెగ్యులారిటీ ఉన్న దినపత్రికల జాబితాను పరిశీలించి వాటిని ఎంపానల్ లో చేర్చిన తర్వాత రేట్ కార్డు జారీ చేస్తామని తెలిపారు. యూసుఫ్ తొలగించడం సరైంది కాదు. రాజన్న-సిరిసిల్ల



జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ(డీఎంసీఏ) నుంచి తమ సంఘం సభ్యుడైన యూసుఫ్ ను తొలగిస్తూ జారీ చేసిన ఉత్తర్వును రద్దు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు ఐఅండ్ పీఆర్ కమీషనర్ ను కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ తదితరులు కమీషనర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. యూసుఫ్ పై స్థానికులు కొందరు తప్పుడు కేసులు బనాయించారని, నిరాధారమైన ఆరోపణలతో కేసు నమోదు చేసి అతనిని డీఎంసీఏ నుంచి తొగింపజేశారని వారు ఆరోపించారు. అకారణంగా తొలగించిన యూసుఫ్ ను తిరిగి డీఎంసీఏ లోకి తీసుకోవాలని వారు కోరారు. యూసుఫ్ ను తొలగించిన విషయంపై కమీషనర్ హరీష్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ సంఘటనను సరిచేయడానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. యూసుఫ్‌ను తిరిగి డీఎంసీఏ లోకి తీసుకోవాలని వారు కోరారు. యూసుఫ్‌ను తొలగించిన విషయంపై కమీషనర్ హరీష్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ సంఘటనను సరిచేయడానికి చర్యలు తీసుకుంటానని అన్నారు.

# మారిన జీవనశైలి వల్లనే క్యాన్సర్ ముప్పు





● డాక్టర్ రుబీనా

**భీమదేవరపల్లి, జనవరి 4 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ ఏకెవిఆర్ డిగ్రీ కళాశాలలో వంగర ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులచే 'వరల్డ్ క్యాన్సర్ డే' సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు డా.రెహమాన్, డా.రుబీనా పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న కాలుష్యం మారుతున్న ఆహారపు అలవాట్లు జీవనశైలిలో మార్పు, వ్యసనాలకు అలవాటు పడి క్యాన్సర్ బారిన బారిన పడుతున్నారన్నారు. తొలిదశలో గుర్తించి ఆందోళన చెందకుండా చికిత్స చేయించుకుంటే ప్రాణపాయం తప్పుతుందని తెలిపారు. సరైన సమయంలో గుర్తించకపోవడం, సరైన చికిత్స చేయించుకోకపోవడం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భూపతి శ్రీకాంత్ , అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి ఆలయానికి విరాళం

**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 04(నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ పెద్దమ్మ తల్లి దేవత విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవానికి కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్ విరాళం అందించారు. ఈనెల 7న గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ట నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం రూ.20,216 లు ముదిరాజ్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం బాధ్యులకు విరాళాన్ని అందించారు. ఇందులో ముదిరాజ్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు ఇట్టబోయిన నాగరాజు, సుంచు చంద్రమౌళి, దొంతరబోయిన రవీందర్ తదితరులు ఉన్నారు.



## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కడారి ప్రభాస్



భీమదేవరపల్లి
ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్): హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండల అధ్యక్షుడిగా ముత్తారం గ్రామానికి చెందిన కడారి ప్రభాస్ నియమితులయ్యారు. మంగళవారం ముల్కనూరులో ఎమ్మార్పీఎస్ మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి నియామక పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ అమలుకై ఈనెల 7న హైదరాబాదులో జరిగే వేల గొంతులు లక్ష డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం కోరారు. ఐలపాక స్వామి, పార్లందుల మహేందర్, గజ్జల వెంకటస్వామి, తాళ్ల పెల్లి ఆశీర్వాదం, కనకం రాజ్ కుమార్, దిలీప్ ,రమేష్ గజ్జల రవీందర్

## ఉత్తమ ఏపీఓగా కుమారస్వామి

**జిల్లా కలెక్టర్ చే ప్రశంసా పత్రం అందుకున్న భీమదేవరపల్లి ఏపీవో**



**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 04(నినాదం న్యూస్ ):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఉపాధి హామీ పథకంలో ఏపీవో విధులు నిర్వహిస్తున్న కుమారస్వామి ఉత్తమ ఏపీవో అవార్డుకు ఎంపికయ్యారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు హసన్ పర్తి మండల కేంద్రంలో మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భీమదేవరపల్లి మండలంలో మెరుగైన సేవలు అందించినందుకు అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న కుమారస్వామికి మండలంలోని అధికారులు, నాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు,ఫీల్డ్ అసిస్టెంట్ లు, తోటి సిబ్బంది అభినందనలు తెలిపారు.


## గీత కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

**భీమదేవరపల్లి:**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన కొక్కిస రాజు గౌడ్(36) ఇటీవల తాటి చెట్టు పై నుంచి పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబానికి అండగా గ్రామస్తులు కలిసి స్వచ్ఛందంగా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామస్తులు సేకరించిన రూ.27,900 సోమవారం అందించారు. మృతుని ఇంటికి వెళ్లి పరామర్శించి, సానుభూతి తెలిపారు.

# బుర్రకథా పితామహుడు నాజర్





ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావ భావలతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుర్రకథ ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించిన బుర్రకథ పితామహుడు నాజర్, నటుడు, ప్రజారచయిత, గాయకుడు. " ఈ గండపెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు" అని తన కళను ప్రజా ప్రయోజనానికే అంకితం చేసిన ప్రజా కళాకారుడు. అంగాంగ విన్యాసాల ద్వారా ఆటపాట ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజపరిచిన గొప్ప ప్రతిభాశాలి షేక్ నాజర్. నాజర్ ప్రతిభకు ముగ్ధుడైన సినీ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు సినీరంగంలో స్థిరపడమని కోరినా, ఆ లోకం తన లోకం కాదని సవినయంగా చెప్పి, జనపదమే తన పథమని బుర్రకథలు చెప్పుకుంటూ జనంతో మమేకమై, జీవితాంతం ప్రజా కళాకారుడిగా కొనసాగిన ప్రజా గాయకుడు నాజర్. బుర్రకథా పితామహుడుగా పేరొందిన షేక్ నాజర్ (ఫిబ్రవరి 5, 1920 – ఫిబ్రవరి 22, 1997) బుర్రకథా కళాకారుడు, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. పద్మశ్రీ అవార్డు గ్రహీత. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఓ పేద దూదేకులముస్లిం కుటుంబంలో 1920, ఫిబ్రవరి 5 వ తేదీన షేక్ మస్తాన్, బీబాబీలకు దంపతులకు జన్మించారు. నాజరు పూర్తి పేరు "షేక్ నాజరు వలి". మహ్మదీయ సభ పేరిట నాటకా లాడి మంచిపేరు గడించారు. ఆయన కృష్ణలీలలో దేవకి, శ్రీ కృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి ఆడవేషాలు వేసి మెప్పించారు. పాదుకా పట్టాభిషేకంలో కైకేయి, ఖిల్జీ రాజ్యపతనంలో కమలారాణి పాత్రలు పోషించారు. పాఠశాల స్థాయిలో "ద్రోణ" పాత్రకు జీవం పోశారు. ఆర్యమత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. నాస్తికుడయ్యారు. తెనాలిలోని "బాలరత్న నాటక సమాజం"లో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు సాగింది. కమ్యూనిస్టు పార్టీలోచేరి ప్రజానాట్య మండలి వేదిక ద్వారా పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను బుర్రకథల ద్వారా ప్రచారం చేశారు. వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించు కున్నది. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్ కరువు మొదలగు ఇతివృత్తాలలో సమకాలీన రాజకీయాలు జోడించి బుర్రకథలు రూపొందించారు. పద్మశ్రీ నాజర్ జీవిత చరిత్రను అంగడాల వెంకట రమణమూర్తి... పింజారీ అనే పుస్తకంగా ప్రచురించాడు. కొంతకాలం విరసం సభ్యులుగా ఉన్నారు. అగ్గిరాముడు, బలేబావ, నిలువు దోపిడీ, పెత్తందార్లు, పుట్టిల్లు, మనుషులంతా ఒక్కటే – సినిమాల్లో నాజర్ బుర్రకథలు కన్పిస్తాయి. పూల రంగడు సినిమాలో "అక్కినేని"కి నేర్పించారు. చాలా మందికి ఈ గాంధర్వ విద్య నేర్పారు. ఆయన గళ గాంభీర్యాన్ని, మాధుర్యాన్ని గమనించి, "ఆసామీ" నాటకాన్ని రచించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల్లో ఆసామీ నాటకం ప్రథమ బహుమతి పొందింది. నాజర్ ఏడుసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు. ఆంధ్రనాటక అకాడమీ 1981లో "ఉత్తమ కళాకారుడు" అవార్డుతో సత్కరించింది. 1986 లో భారత ప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదుతో నాజరును సత్కరించింది. రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవా చార్యులు, నాజరు బుర్రకథ విని అమితానందంతో బళ్లారికి ఆహ్వానించడం, మద్రాసులో ప్రదర్శన చూసిన గోవిందరాజుల సుబ్బారావు నాజరుని అభినందిస్తూ కౌగిలించు కోవడం, ప్రముఖ పాత్రికేయుడు కె. అబ్బాస్ నాజరును "ఆంధ్ర అమరషేక్" అని అభివర్ణించడం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నాజరు ప్రజా భాషకు ముగ్ధుడై "నా బిడ్డడు ఎంత ఎదిగిపోయాడో" అని ఆలింగనం చేసుకోవడం, నాజరు లోని కళా ప్రతిభకు తిరుగులేని నిదర్శనాలు. "నాటకాల్లో బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం నా నట జీవితానికి పట్టం కట్టింది" అని ప్రముఖ నటి జమున వ్యాఖ్యానించారు. గుంటూరుకు ఎన్టీఆర్ వచ్చినప్పుడు "నేను మీ అభిమానిని" అని నాజర్ చెపితే... "నేను మీ ఫాన్‌ను" అని ఎన్టీఆర్ చెప్పి అందరినీ ఆనంద పరిచారు. "హరికథకు ఆదిభట్ల ఎలాంటివాడో బుర్రకథకు నాజర్ అలాంటివాడు" అని ముదిగొండ శివప్రసాద్ తదితర ప్రముఖుల అభిప్రాయాలు ఉంటే నాజర్ గొప్పతనం స్పష్టం అవుతున్నది. కటిక పేదరికాన్ని మరణించే వరకు అనుభవించిన నాజర్ 1997, ఫిబ్రవరి 22 న అంగలూరులో మరణించారు.

# కళారంగ ఘనాపాఠి గరికపాటి

కళలు సామాజిక ప్రగతికి దోహదం చెయ్యాలని, జనాన్ని చైతన్య స్ఫూర్తితో ముందుకు నడిపించాలని, అందుకు కళలు కరదీపికలు కావాలని ప్రతికరణ శుద్ధిగా నమ్మి ఆ లక్ష్య సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి గరికపాటి రాజారావు. కళ ప్రజాచైతన్యం కోసమేనని నమ్మి, జీవితాన్ని కళకే అంకితం చేసిన ప్రజా కళాకారుడు, ప్రజావైద్యుడు రాజారావు. నాటకరంగం ద్వారా ప్రజాకళా రంగానికి దిక్సూచిగా నిలచిన వైతాళికుడు డాక్టర్ గరికపాటి రాజారావు. తెలుగు నాటక రంగంలో అతి నవీన భావాలతో వినూత్న విలువలను ఆవిష్కరించి తెలుగు నాటక దశను, దిశను మార్చి సామాన్య ప్రజల సాంస్కృతిక నైతికబలిగా నిలచిన కళాస్రష్ట ఆయన. ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేసిన ఘనత ఆయనదే. గరికపాటి రాజారావు (ఫిబ్రవరి 5, 1915 – సెప్టెంబరు 8, 1963) తెలుగు సినిమా దర్శకుడు, నాటకరంగ ప్రముఖుడు, ఆంధ్ర ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు. ప్రజానాట్య మండలి సాంఘిక నాటకాలకు పెద్దపీట వేసింది. ఈ నాటక సంఘం ద్వారా అనేకమంది ప్రతిభ వంతమైన కళాకారులు పరిచయమయ్యారు. చెప్పుకోదగిన వారిలో దేవిక, అల్లు రామలింగయ్య, సంగీత దర్శకులు మోహన్ దాస్, టి.చలపతిరావులు, నృత్యదర్శకుడు వేణుగోపాల్, రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ఉన్నారు. రాజారావు 1915 ఫిబ్రవరి 5వ తేదీన రాజమండ్రిలో గరికపాటి కోటయ్య, దేవరా రామలింగమ్మల దంపతులకు జన్మించారు. చిన్నప్పుడే కాకినాడలోని ఆదిభట్ల నారాయణదాసు హరికథకు వెళ్లి, పాటకు తగిన తాళం వేసి తన ప్రతిభను నిరూపించుకుని అభినందనలు పొందారు. చదువు కుంటున్న రోజుల్లో విచిత్ర వేషధారణలో ఆసక్తి చూపించిన రాజారావు, హరిశ్చంద్ర నాటకంలోనూ ఓ వేషం ధరించి పాఠశాల అధ్యాపకుల మెప్పు పొందారు. తరువాత విజయ నగరంలో మేనమామ సుబ్రహ్మణ్యం ఇంట చేరి ఎస్–ఎస్ఎల్సీ పూర్తి చేశారు. రాజారావుకు 15వ ఏటనే నాగేశ్వరమ్మతో వివాహం జరిగింది. తండ్రి ఉద్యోగం చేసిన సికిందరా బాదు లాలాగూడ వర్క్‌షాపులో చిన్న గుమాస్తాగా జీవనం సాగిస్తూ, పై ఉద్యోగి పీడన భరించలేక దానికి రాజీనామా చేసి 1937లో మద్రాసు చేరారు. మద్రాసులో ఎల్.ఐ.యం చదువుతున్న రోజుల్లో పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి (పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు) డాక్టర్ రామదాసు ఆయనకు ప్రాణ స్నేహితులు. అలాంటి స్నేహ వాతావరణ ప్రభావం వలన రాజారావు మార్క్సిస్టు రాజకీయ ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు. మద్రాసులో చదువుతున్నప్పుడే సహ విద్యార్థులతో కలిసి గుళ్లపల్లి నారాయణ మూర్తి రచించిన విడాకులు నాటకానికి దర్శకత్వం వహించారు. మద్రాసులో రాజారావు దర్శకత్వంలో ప్రదర్శించిన షాజహాన్ నాటకం సంచలనాన్ని సృష్టించింది. షాజహాన్‌గా ఎస్వీఆర్ సాంబశివరావు, జహనారాగా డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు, ఔరంగజేబుగా రాజారావు అద్భుతంగా నటించి పలువురి ప్రశంసలు పొందారు. ఆ నాటకంలో రాజారావుకు సుప్రసిద్ధ నటుడు రూపశిల్పి దేవీప్రసాద్ రాయ్ చౌదరి మేకప్ చేయడం విశేషం. మద్రాసులో విద్యార్థులను సమీకరించి భీమసేనాటి బాగుబాగు, గాలి బాల సుందరరావు అపోహ వంటి నాటకాలను ప్రదర్శించారు. వృత్తి రీత్యా వైద్యుడైన రాజారావు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి విజయవాడలోని పోరంకిలో ప్రజా వైద్యశాల నెలకొల్పి ఫీజులు తీసుకోకుండా మందులు కూడా తనే కొనుగోలు చేసి ఉచితంగా రోగులకు సేవ చేసేవారు. కొంతకాలం రాజమండ్రి లోనూ ప్రజావైద్యశాలను నిర్వహించారు.

# రక్తమోడుతున్న రహదారులు

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

భారత్‌లో రోడ్డు ప్రమాదాల్లో మరణించేవారి సంఖ్య పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. మితిమీరిన వేగం, హెల్మెట్ లేకపోవడం వంటి పలు కారణాలతో చాలా మంది రోడ్డు ప్రమాదాల్లో అర్ధాంతరంగా ప్రాణాలు వదులుతున్నారు.రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం మరణాలకు భద్రతా ప్రమాణాలు పాటించక పోవడమే కారణం అవుతోంది. సేఫ్టీ ప్రికాషన్స్ తూచ తప్పక పాటిస్తే ప్రాణనష్టం చాలా వరకు తప్పించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. 2024 లో అతి వేగం కారణంగా ప్రమాదాల బారిన పడి చనిపోయిన వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను రోడ్డు ప్రమాదాల వార్షిక నివేదికలో ఆ శాఖ అధికారులు వెల్లడించారు. 2024లో మన దేశంలో మొత్తం 4,49,002 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిల్లో 1,51,113 మంది చనిపోయారు. మరో 4,51,361 మంది గాయపడ్డారు. వీటి ప్రకారం.. దేశంలో సగటున ప్రతిరోజూ 1,230 రోడ్డు ప్రమాదాలు, 414 మరణాలు నమోదవుతున్నాయి. అంటే ప్రతి గంటకు 51 ప్రమాదాలు జరుగుతుండగా, 17 మంది చనిపోతున్నారని అర్థం. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు మునుపటిస్థాయికి చేరుకున్నాయని తెలిపారు. గతేడాది 12 నెలల్లో రాష్ట్రంలో 6,882 మంది రోడ్డుప్రమాదాల్లో మరణించగా, గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 3,245 మంది పౌరులు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని రోడ్‌సేఫ్టీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అధిక శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల కారణంగానే జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రతపై అవగాహన ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. రోడ్డు భద్రతపై ప్రజలందరికీ అవగాహన కల్పించేలా ప్రతియేటా వారోత్సవాల పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 'రోడ్డు భద్రత-ప్రతి ఒక్కరి బాధ్యత' అనే నినాదం మాటలకే పరిమితమవుతోంది. రయ్ రయ్ మంటూ వేగంగా దూసుకెళుతుండడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నిబంధనలను పాటించాల్సిన బాధ్యత వాహనదారులపై ఉంది. నిబంధలను పాటించడం లేదనే విషయం ఇటీవల జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే తెలుస్తోంది. మొత్తం ప్రమాదాల్లో డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు, లెర్నర్ లైసెన్స్ ఉన్నవారు వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల సంఖ్య 15 శాతం వరకు ఉంది. రోడ్లపై ఉండే గుంతల కారణంగా 2024 లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 8.2 శాతం పెరిగింది. ఈ కారణంతో గతేడాది చనిపోయిన వారి సంఖ్య 2,140 వరకు ఉంది. 10 సంవత్సరాలు పైబడిన వాహనాలను వాడటం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి ప్రమాదాల్లో చనిపోయిన వారి సంఖ్య 41 శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 32.9 శాతం మంది, గ్రామీణ ప్రాంతాల్లో 67.1 శాతం మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. సాఫీగా సాగాల్సిన ప్రయాణాలు అర్ధాంతరంగా ముగుస్తున్నాయి. రయ్ మని దూసుసుపోయే వాహనాలు, మృత్యుశకటాలుగా మారుతున్నాయి. స్వీయ తప్పిదాలో, సాంకేతికలోపాలో కానీ, కోట శ్రీనివాసరావు, బాబుమోహన్, అజారుద్దీన్ వంటి ఎందరో ప్రముఖుల కుమారులు, హరికృష్ణ వంటి సెలబ్రిటీలు, రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. కుటుంబాలకు తీరని దుఃఖం మిగిల్చారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే జరుగుతున్నాయని ఇప్పటివరకు జరిపిన పలు సర్వేలలో వెల్లడైంది. ఇదే నిపుణుల పరిశీలనలోనూ తేలింది. తాము తెలిసితెలిసి చేస్తున్న తప్పిదాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్నిసార్లు ఎదుటివాళ్ల ప్రాణాలను కూడా రిస్క్‌లో పడేస్తున్నారు.

**వాహనాలు నడిపేవారికి నిపుణుల సూచనలు....**

వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగాన్ని దూరంగా ఉంచి వాహన డ్రైవింగ్ చేయాలి. సెల్ఫ్ డ్రైవింగ్ అయినప్పుడు రోడ్డుపైనే దృష్టి నిలపాలి. మితిమీరిన వేగం, డ్రంకెన్ డ్రైవ్ ప్రమాదాలకు మూలమని గుర్తించాలి. బైక్ నడిపేవారు హెల్మెట్ ధరించాలి. కారు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇక హైవేల్లో రోడ్లు స్ట్రెయిట్‌గా లేనప్పుడు 80 కిలోమీటర్లకు మించి వేగం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రివేళ ప్రయాణాల్లో 80 నుంచి 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ స్పీడు ఏ మాత్రం క్షేమకరం కాదు. 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఉన్నప్పుడే సడన్ బ్రేక్‌కు కారు ఆగుతుంది. అంతకుమించిన వేగంతో వెళ్తూ సడన్ బ్రేక్ వేస్తే ప్రమాదానికి దారితీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ వచ్చినా, నీళ్లు తాగాలనుకున్నా కారును పక్కకు ఆపాలని నిపుణులు సూచిస్తున్నారు. చేరాల్సిన గమ్యానికి ఓ పది నిమిషాలు ఆలస్యమైనా పర్వాలేదు. ఆ పది నిమిషాలు కవర్ చేయాలన్న తొందరలో గంటకు వంద కిలోమీటర్ల వేగంతో ప్రయాణించడం ప్రాణాలను పణంగా పెట్టడమే అవుతుంది. అసలు గంటకు 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణానికి, వంద కిలోమీటర్ల స్పీడుతో వెళ్లడానికి తేడా పది నిమిషాలే. అందుకే ఆ పది నిమిషాల కోసం రిస్క్ తీసుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరో ముఖ్య సూచన ఏమిటంటే కార్లలో బెలూన్స్ ఓపెన్ కావడం అనేది అన్ని ప్రికాషన్స్ కరెక్ట్‌గా పాటిస్తేనే జరుగుతుందని అంటున్నారు. సీటు బెల్ట్ పెట్టుకోకపోయినా బెలూన్స్ ఓపెన్ కావని నిపుణులు చెబుతున్నారు. అంతేకాక స్పీడు వంద కిలోమీటర్లు దాటినప్పుడు బెలూన్స్ కూడా ఆ ప్రమాద తీవ్రతను ఆపలేవని చెబుతున్నారు. కావున జాగ్రత్తగా డ్రైవ్ చేయడం ద్వారా మన ప్రాణాల్ని నిలుపుకుందాం. ఎదుట వచ్చేవారి ప్రాణానికి హామీ ఇద్దాం. వేగం వద్దు.ప్రాణం ముద్దు.

**ప్రాణదాతలకు రూ.5వేలు పారితోషికం.. కేంద్ర ప్రభుత్వ కొత్త పథకం...**

రహదారి ప్రమాదాలుజరిగినప్పుడు వెంటనే స్పందించి ఆదుకునేవారికి రూ.5,000 చొప్పున పారితోషికాన్ని అందించే పథకాన్నిప్రారంభించినట్లు కేంద్రం తెలిపింది. తొలి గంటలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడేవారికి నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందిస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాణదాతలుగా నిలిచిన 10 మందికి రూ.లక్ష చొప్పున అందిస్తారు. "ప్రమాదం గురించి మొట్టమొదటగా ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు తెలియపరిస్తే వివరాలను వైద్యులతో ధ్రువీకరించుకుని పోలీసులు ఒక రసీదు ఇస్తారు. దాని నకలును జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీకి పోలీసు స్టేషన్ నుంచి పంపిస్తారు. ఎవరైనా తమంతట తాముగా బాధితుల్ని నేరుగా ఆసుపత్రికి తరలిస్తే పూర్తి వివరాలను ఆసుపత్రివారే పోలీసులకు తెలియపరచాలని కేంద్రం మార్గదర్శకాల్లో పేర్కొంది.

**బడి పుస్తకాల్లో రోడ్డు భద్రతా పాఠాలు...** ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు పాఠ్యాంశాల్లో చేరనున్న ట్రాఫిక్ రూల్స్.దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రపంచ దేశాల కింద తలవంపులు తెస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉన్నా, వాటిని పాటించని దేశంగా భారతదేశానికి అవమానాలు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా ఏటా లక్షలాది మంది చనిపోతుండడంతో కుటుంబాలు క్షోభ పడుతున్నాయి. అత్యాధునిక టెక్నాలజీతో పలు దేశాలు రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూసుకుంటున్నాయి. దేశంలో మాత్రం రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని పూర్తిగా తగ్గించేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ రూ.7,270 కోట్లతో ప్రత్యేక ప్రణాళికను అమలుచేయనుంది. దేశంలో జరుగుతున్న మొత్తం రోడ్డు ప్రమాద మరణాల్లో 85 శాతం మరణాలు సంభవిస్తున్న 14 రాష్ట్రాల్లో రోడ్డు భద్రతను బలోపేతం చేయనుంది. మొదటగా ఆ పద్నాలుగు రాష్ట్రాల్లో రోడ్డు భద్రత కోసం నిధులు వెచ్చించనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తోపాటు తమిళనాడు, కర్నాటక, ఒడిశా, బీహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, హర్యానా, అసోంలో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆయా రాష్ట్రాలకు రోడ్డు భద్రత ప్రణాళికను పంపించింది. ఈ పథకం కింద రోడ్డు భద్రతపై విస్తతంగా అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేయబోతుంది. 2022-23లో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టడం జరిగింది. దీంతో పాటు ఇంటర్మీడియెట్ లోనూ రోడ్డు భద్రతపై ఒక అధ్యాయాన్ని ప్రవేశ పెట్టారు .ఇవే కాకుండా నాలుగు లక్షలకు పైగా జనాభా ఉన్న పట్టణాలు, నగరాల రోడ్లపై స్పీడ్ మేనేజ్‌మెంట్ పరికరాలను ఉంచనున్నారు. రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులపై పెరుగుతున్న ప్రమాదాలను నివేదించడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర రహదారులు, పట్టణ రహదారులపై ద్విచక్ర వాహనాల కోసం ప్రాధాన్య కారిడార్లను గుర్తించనున్నారు. అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టాన్ని విస్తరిస్తూ, వాహనాల భద్రత, డ్రైవర్ల శిక్షణపై ప్రచారాలు చేయనున్నారు. అంబులెన్స్‌ల కోసం కమాండ్ అండ్ కంట్రోల్ (డేటా) సెంటర్‌తో పాటు ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, పౌరులు కూడా బాధ్యతాయుతంగా ఉండి భద్రతా నియమాలను సక్రమంగా పాటించినప్పుడు రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతుంది.

**కామిడి సతీశ్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా**
**తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.**
**9848445134**

---

# భీష్మాష్టమి

మాఘ శుక్ల సప్తమి మొదలు ఏకాదశి వరకు గల ఐదు రోజులను భీష్మ పంచకాలుగా భావిస్తారు. భారత యుద్ధం సమయంలో క్షతగాత్రుడై, దక్షిణాయనంలో ప్రాణం వదలడానికి ఇష్టం లేని భీష్ముడు ఉత్తరాయణం వచ్చే వరకూ, అంపశయ్యపై పరుండి ఉండి, మాఘ శుక్ల సప్తమి నుండి ఐదు రోజులలో రోజుకొక ప్రాణాన్ని విడనాడారని చెపుతారు. కాల నిర్ణయ చంద్రిక, నిర్ణయ సింధు, ధర్మసింధు, కాల మాధవీయం మున్నగు గ్రంథాలు మాఘ శుద్ధాష్ట మిని భీష్మ నిర్యాణ దినంగా చెపుతున్నాయి. కార్తీక బహుళ అమావాస్య నాడు భారత యుద్ధ ప్రారంభ దినంగా భావించ బడుతుంది. కార్తీక మాసంలో రేవతీ నక్షత్రం నాడు శ్రీకృష్ణుడు, కౌరవుల వద్దకు రాయబారానికి పయనమైనట్లు భారతంలో ఉంది. కార్తీక పౌర్ణమినాడు కృత్తికా నక్షత్రం అవుతుంది. కృత్తికా నక్షత్రానికి మూడవ పూర్వపు నక్షత్రం రేవతి. ఆనాటి గణనలో రేవతీ నక్షత్రం శుద్ధ త్రయో దశి అవుతుంది. రాయబారిగా వెళ్ళిన కృష్ణుడు హస్తినాపురంలో కొద్ది రోజులున్నాడు. వస్తూ కర్ణునితో మాట్లాడాడు. సదరు సంభాషణలో శ్రీకృష్ణుడు జ్యేష్టా నక్షత్రంతో కూడిన అమావాస్య నాడు యుద్ధం ప్రారంభం కాగలదని కర్ణునికి చెపుతాడు. భీష్ముడు అంశయ్యపై యాభై ఎనిమిది రోజులు ఉన్నట్లు భారతంలో స్పష్టపరచ బడింది. భీష్మాచార్యులు యుద్ధం చేసింది పది రోజులు. భారత యుద్ధం ప్రారంభమైన కార్తీక బహుళ అమావాస్య నుండి 68 రోజులు లెక్కిస్తే వచ్చేది మాఘ శుద్ధాష్టమి. అదీగాక భారత యుద్ధ ప్రారంభంలో అర్జునుడు బంధు వధకు శంకిస్తాడు. ఆ సందర్భం లోనే శ్రీకృష్ణుడు, విజయునికి తత్త్వోపదేశం చేస్తాడు. ఆ ఉపదేశమే భగవద్గీత. ఈ ఉపదేశం యుద్ధం ప్రారంభ దినాన జరిగింది. ఆ దినాననే గీతా జయంతి (భగ వద్గీత పుట్టినదినం)గా జరపడం కొన్ని చోట్ల ఉంది. కనుక మాఘ శుక్లపక్ష అష్టమియే భీష్మ నిర్యాణ దినంగా భావిస్తారు. మహాతపస్వి అయిన భీష్ముడు పితృభక్తికి, ఇచ్చినమాట నిలబెట్టు కోవడానికి, శౌర్యసంపదకు ఓ గొప్ప ఉదాహరణ. అపారమైన శాస్త్రవిజ్ఞానాన్ని, ధర్మతత్వాన్ని, పరమాత్మతత్వాన్ని కూడా చక్కగా అవగతం చేసుకున్నాడు. అంపశయ్య మీద ఉన్నప్పుడు కృష్ణ భగవానుడి ప్రోత్సాహంతోనే ధర్మరాజుకు గొప్ప జ్ఞానాన్ని ప్రబోధించాడు. వర్ణాశ్రమ ధర్మాలు, రాజ ధర్మాలు, ఆపద్ధర్మాలు, మోక్ష ధర్మాలు, శ్రాద్ధ ధర్మాలు, స్త్రీ ధర్మాలు, దాన ధర్మాలు, ఇలాంటి ఎన్నెన్నో ధర్మాలను గురించి ధర్మరాజుకు ఉన్న ధర్మసందేహా లన్నింటినీ తీర్చి సమాధానా లిచ్చాడు భీష్ముడు. ఆనాడు ధర్మరాజుకు ఉపదే శించిన విష్ణు సహస్రనామాలు ఈనాటికీ ప్రజల నాలుకల మీద నానుతూనే ఉన్నాయి. పద్మ పురాణంలో, హేమాద్రి వ్రత ఖండంలో భీష్మాష్టమి గురించి చెప్పబడింది. భీష్మాష్టమి రోజున భీష్మునికి తిలాంజలి సమర్పించే వారికి సంతాన ప్రాప్తి కలుగు తుందని విశ్వాసం. ఈనాడు భీష్మునికి తర్పణం విడవాలని స్మృతి కౌస్తుభం తెలుపుతున్నది. కృత్యసార సముచ్చయాధారంగా భీష్మాష్టమి శ్రాద్ధదినం. భీష్మ ద్వాదశి వ్రతం ఈ దినాననే ప్రారంభిస్తారని నిర్ణయ సింధువు స్పష్ట పరుస్తున్నది. భీష్మాష్టమి భారత దేశమంతటా జరుపుకోవాల్సిన పర్వమని వ్రతోత్సవ చంద్రిక సూచిస్తున్నది. కొందరు పంచాంగకర్తలు ఈనాటి వివరణలో నందినీ పూజ, భీష్మాష్టమిగా పేర్కొంటారు. "వైయాఘ్ర సద్య గోత్రాయ సాంకృత్య ప్రవరాయచ, అపు త్రాయ తదామ్యే తజ్జలం భీష్మాయవర్మణే, వసూ నామావతారాయ శంతనోరాత్మజాయచ, అర్ఘ్యం దదామి భీష్మాయ ఆబాల బ్రహ్మచారిణి". అంటూ ఈదినం నాడు భీష్ములకు తర్పణం విడవాలని అమాదేర్ జ్యోతిషి పేర్కొంటున్నది. ఈనాడు తర్పణం శ్రాద్ధం చేసిన వారికి సంవత్సర పాపం నశిస్తుందని భావన.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

**-భారత రాష్ట్ర సమితి నాయకులకు కార్యకర్తలకు హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ పిలుపు**



**ఎల్కతుర్తి నినాదం న్యూస్ :** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈరోజు హుస్నాబాద్ మండల పరిధి భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ.. నాయకులు నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకుని, ప్రజలకు అండగా నిలవాలని అలాగే పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నాయకులంతా సమన్వయంతో పని చేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు పని చేయాలని కోరారు, అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని అన్నారు ,రాబోయే స్థానిక ఎన్నికల్లో మళ్లీ %దీ=ా% జెండా ఎగరడం ఖాయం అని సతీష్ కుమార్ అన్నారు, ఈ సందర్భంగా మహమ్మదపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ తిరుపతి రెడ్డి , బొల్లి తిరుపతి లు కూచనపల్లి గ్రామానికి చెందిన గూల్ల చంద్రమౌళి. శ్రీకాంత్ హుస్నాబాద్ ఇతరులు వివిధ పార్టీలనుండి మాజీ %వీశ్రీఖ% సతీష్ కుమార్ గారి ఆధ్వర్యంలో %దీ=ా% పార్టీలో చేరారు , ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ప్రధాని మోడీ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం



**చింతపల్లి, ఫిబ్రవరి 4(నినాదం న్యూస్)** కేంద్ర బడ్జెట్లో బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా బడ్జెట్ రూపొందించినందుకుగాను ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి మండల శాఖ అధ్యక్షుడు సముద్రాల నగేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్ను స్వాగతిస్తూ పాలాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి ఎన్నం శేఖర్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కుంభం శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్, మాజీ ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్, నాయకులు కుకుడపు రామకృష్ణ, పిల్లి వెంకన్న, నల్ల శివకుమార్, గజ్జ అభినవ్, కుందేళ్ళ చెన్నయ్య యాదవ్, సైదులు యాదవ్, శ్రీనివాస్, బొల్లాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలపై సమావేశం



**మంగపేట, ఫిబ్రవరి 4 ( నినాదం న్యూస్ ) :** గ్రామపంచాయతీ, ఎంపీటీసీ , జడ్పీటీసీ ఎన్నికలపై రాజకీయ పార్టీలతో మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బద్రు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు ఈ సమావేశానికి హాజరై ఎన్నికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంతో పాటు నూతన పోలింగ్ స్టేషన్లు అయిన మండలంలోని కొత్త చీపురు దుబ్బ, శనగకుంట, తొండ్యాల లక్ష్మీపురంలను వారు సూచించినట్లు ఎంపీడీవో బద్రు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఎం.మమత, మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు ఆలేటి సుదర్శన్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా బయ్య దేవేందర్ యాదవ్ జన్మదిన వేడుకలు



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** టిపిసిసి రాష్ట్ర కోఆర్డినేటర్ బయ్య దేవేందర్ యాదవ్ జన్మదిన వేడుకలు సూర్యాపేట జిల్లా కేంద్రంలో మిత్రుల ఆధ్వర్యంలో మంగళవారం శాలువతో సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ భగవంతుడు ఆయురారోగ్యాలు కల్పించాలని మరెన్నో పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గంజికుంట్ల గోపీనాథ్,ఎల్, నాగేశ్వరరావు, రెబ్బ కృష్ణమూర్తి, శెట్టి రాజశేఖర్, వీరబోయిన మధు యాదవ్, ఉయ్యాల నరసయ్య, నాగలింగం, బోల్క మల్లేష్ యాదవ్, భద్రు నాయక్, నాగలింగం, పిల్లలమర్రి కలింగం, వెంకన్న, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు

## కుంటి సాకులతో అడ్డుతగిలితే ప్రభుత్వానికి పతనం తప్పదు



**కోదాడ/నడిగూడెం, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** ఈ నెల 7 హైదరాబాద్ లో జరగబోయే లక్ష డప్పులు-వేల గొంతుల కార్యక్రమాని ఎవరు ఆపలేరని మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ కోదాడ నియోజకవర్గం కోశాధికారి మందుల రాంబాబు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రం లో ఆయన విలేకరుల తో మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు,పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణన్న తలపెట్టిన లక్ష డప్పులు -వేల గొంతుల కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుంటి సాకులు చూపిస్తూ పోలీస్ శాఖ నుండి అనుమతులు రాకుండా అడ్డుపడుతుతూ...ఈ కార్యక్రమం లో అసాంఘీక శక్తులు చేరి విధ్వంసం సృష్టించే అవకాశం, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని పోలీస్ అధికారులు చేత చెప్పించడం బాధాకరం అన్నారు.ఈ కార్యక్రమం ఎవరిపై యుద్ధం కాదని ఎస్సి వర్గీకరణ న్యాయబద్ధమైనదని,మాదిగ ల ఆకాంక్ష ను ప్రపంచానికి తెలియజేయడం కోసమే జరుగుతుందన్నారు.7 న జరిగే కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుపడితే కాంగ్రెస్ ప్రభుత్వ కూల్చదానికి మాదిగలే ముందు నదుస్తారని ఆయన హెచ్చరించారు.

## పేదింటి యువకుడికి కార్పొరేట్ వైద్యం

.చౌటుప్పల్, ఫిబ్రవరి 4 (నినాదంన్యూస్): మంచానికే పరిమితమైన పేదింటి యువకుడికి హైదరాబాద్లో కార్పొరేట్ వైద్యం అందించి మరోసారి మానవత్వంచాటుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్గోపాల్రెడ్డి. చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలో సంవత్సరం క్రితం గ్రామపంచాయతీ ట్రాక్టర్ వెనుక నుండి ఢీ కొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన తీగుళ్ళ భానును జనవరి 26న ఇంటికి ఎమ్మెల్యే రాజగోపాల్రెడ్డి వెళ్లి పరామర్శించారు.భాను కోలుకోవడానికి ఆర్థిక సాయంతో పాటు హైదరాబాదులో మెరుగైన చికిత్స అందిస్తానని ఆరోజు కుటుంబానికి హామీ ఇచ్చారు. వెంటనే తన సిబ్బంది ద్వారా బాను వైద్య రిపోర్టులు తెప్పించి హైదరాబాద్ జూబ్లీహిల్స్ అపోలో వైద్యులను సంప్రదించారు. మంగళవారం తన సొంత ఖర్చులతో చిన్న కొండూరు గ్రామానికి ప్రత్యేక అంబులెన్సు పంపించి భానును అపోలో ఆసుపత్రికి తీసుకొచ్చి మెరుగైన వైద్యం చేయిస్తున్నారు. వైద్యం ఎలా అందుతుందని స్వయంగా ఆసుపత్రికి వెళ్లి డాక్టర్స్తో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. పేదలమైన తమకు దగ్గరుండి చికిత్స చేయిస్తున్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డిని హత్తుకుని కన్నీటి పర్యంతమయ్యారు బాను కుటుంబ సభ్యులు. భాను కోలుకునేల చేస్తానని కుటుంబ సభ్యులకు మరోసారి హామీ ఇచ్చారు రాజ్ గోపాల్రెడ్డి.

## మంత్రులు పొన్నం, ఉత్తమ్ కుమార్ రెడ్డి లను సన్మానించిన కాంగ్రెస్ నేతలు



**జమ్మికుంట, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో బీసీల ఆర్థిక సామాజిక రాజకీయ అభివృద్ధి కోసం కులగణన చేపట్టి విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లను సన్మానించిన కాంగ్రెస్ నేత దేశిని కోటి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణన చేయడం అనేది ఒక చరిత్రాత్మక నిర్ణయమని అలాంటి సాహసాన్ని చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం విజయమని ఆయన కొనియాడారు. కులగణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి బీసీల జనాభా ప్రకారము వారికి రాజకీయ ఆర్థిక ఉద్యోగ ఉపాధి రంగాలలో అవకాశాలు రిజర్వేషన్లు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న సందర్భంగా కులగణన కోసం ఎంతగానో కృషిచేసిన ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘన సన్మానం చేసాము కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి. దొంత రమేష్ . జిల్లెల్ల తిరుపతి రెడ్డి .తడక శ్రీకాంత్ .బొంగోని వీరన్న . పంజాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన వేడుకలు




**చింతపల్లి, ఫిబ్రవరి 4 ( నినాదం న్యూస్)** మండల కేంద్రంలోని ఐదవ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం అన్నప్రాసన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందనపు లోహిత్ ప్రజ్ఞాన్ కు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయురాలు ఆర్ .పద్మావతి, హెల్పర్ హసీనా, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## నేటితరం వనితలకు

# ఆదర్శనీయం అహల్యా బాయి హెూల్కర్

**భారతదేశం ఎన్నో విలక్షణమైన సాంప్రదాయాలకు పుట్టినిల్లు. వైవిధ్యమైన సహజ వనరులకు ప్రకృతి సంపదలకు ఒక గొప్ప చిరునామా. ఇలాంటి గొప్ప చరిత్ర ఉన్న భరతభూమి పై ఎన్నో రంగాలలో తమ ధన,మాన ప్రాణాలను త్యాగం చేసిన వారెందరో ఉన్నారు. అలాంటి మహనీయులలో అతి గొప్పనైన వ్యక్తిత్వం కలిగిన లోకమాత, వీరవనిత అహల్యా బాయి హెూల్కర్ ఒకరు .మేకలు ,గొర్రెలు మేపుకునే సామాన్య కుటుంబాని చెందిన మహారాష్ట్రలోని చౌండి అనే ఒక మారుమూల గ్రామంలో 1725 మే 31వ తేదీ అహల్యా బాయి జన్మించింది.మరాఠా సామ్రాజ్యానికి వెన్నుముక అయినా సుబేదార్ మల్హార్ రావు కుమారుడు ఖండే రావు, అహల్యా బాయిల వివాహం 1733లో పూణేలో ఘనంగా జరిగింది.హైందవ స్వరాజ్యంలోని అగ్రశేణి సర్దార్ లలో మల్హార్ రావు ఒకరు. వివాహం తర్వాత అహల్యా బాయి మొదటిసారిగా ఇండోర్ లోని హెూల్కర్ల రాజ్య ప్రసాదానికి వచ్చింది.కోడలు శ్రద్ధ, శక్తులను గమనించిన మామ మల్హార్ రావు ఆమెకు అన్ని అంశాల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.12 ఏండ్ల బాలికగా హెూల్కర్ల కోడలిగా, మొదటిసారి ఇండోర్ రాజభవనంలో అడుగుపెట్టినప్పటి నుండి మల్హార్ రావు వారి భార్య గౌతమీ బాయిలు ఆమెను ఎంతో అపురూపంగా చూసుకున్నారు.అండగా నిలబడ్డారు ఎన్నో నేర్పారు.**

అహల్యా దేవి వ్యక్తిత్వం వికసించడానికి ఎంతో సమర్థవంతంగా ఎన్నో క్లిష్ట పరిస్థితులను చక్కదిద్దేనేర్పు వారి వలన అహల్యా బాయి సొంతమైంది. భర్త ఖండే రావు, కూతురు ముక్తా బాయి మరణం ఆమెను బాధకు గురిచేసింది. అత్త గౌతమీ బాయి మరణం ఆమెకు చాలా పెద్ద దెబ్బ కానీ మామ మల్హార్ రావు మరణాన్ని మాత్రం ఆమె తట్టుకోలేకపోయింది. తన జీవిత వికాసానికి ఒక ఆధార స్తంభాన్ని కోల్పోయింది. ఆర్థిక లావాదేవీలు,పాలన సంబంధ వ్యవహారాలు,న్యాయ సంబంధమైన తీర్పులు లో ఆమె చాలా నిక్కచ్చిగా వ్యవహరించేది. నీతి, నిజాయితీకి, పక్షపాత రాహిత్యానికి మారుపేరుగా అహల్యా బాయి ఎదిగింది. ఆమెతో పని చేసిన ప్రతివారు ఆమెను అభిమానించేవారు. ఆమె వ్యక్తిత్వం పట్ల ఆకర్షితులై గౌరవించేవారు. ఆయుధాగారాన్ని తరచూ సందర్శిస్తూ ఏయే ఆయుధాలను సమకూర్చుకోవాలో అంచనా వేసి ఆయుధాగారాన్ని పటిష్టపరచింది. అహల్యా కారణంగా హెూల్కర్లు ఒక బలమైన సైనిక శక్తిగా ఎదిగారు. ఆయుధాలు సమకూర్చుకోవటానికి తగిన నిధులను త్వరితగతిన విడుదల చేయాలని ఆదేశించేది.ఒక కొత్త ఫిరంగుల తయారీ కర్మాగారాన్ని నెలకొల్పటానికి కావలసిన చర్యలను చేపట్టింది. వివిధ రకాల మరఫిరంగులు వాటిల్లో ఉపయోగించే ఫిరంగి గుండ్ల గురించి ఆమెకు పరిజ్ఞానం ఉండేది .ఫిరంగులు ,గుండ్ల తయారీ నిపుణులకు కావలసిన నిధులను అహల్య సమకూర్చడంతో వారు రేయింబవళ్ళు కష్టపడి అనతికాలంలోనే ఒక కొత్త ఆయుధ కర్మాగారం గ్వాలియర్ లో నిర్మించారు. ఇదంతా అహల్యాదేవి కృషి వల్ల సాధ్యమైంది. మన దేశాన్ని ఆంగ్లేయులు కైవసం చేసుకోవడంలో ఆంగ్లేయులు ఆధునిక ఆయుధాలు కలిగి ఉండడం ఒక ముఖ్యమైన అంశమని చెప్తారు. అయితే అహల్యా బాయి నిర్మించిన ఆయుధ కర్మాగారం పట్ల చరిత్రకారుల చూపు సారింపబడలేదు.హిందూ రాజులు తగిన ఆయుధాలను సమకూర్చుకోలేని అసమర్ధులనే మాట నేటికీ ప్రచారంలో ఉంది. అహల్య దేవి శకం మహిళా సాధికారతకు నిలువెత్తు దర్పణంగా నిలిచింది. మహిళలను సాధికారులను చేయటానికి ఆమె గట్టి కృషి చేసింది. ఇంటికే పరిమితమయ్యే మహిళలను భుజం తట్టి ధైర్యసాహసాలతో పురుషులకు మహిళలు తీసుపోరని ఉద్బోధించింది.స్త్రీల పట్ల వివక్ష ఉండకూడదని సమాజానికి నేర్పింది.వితంతువులకు అండగా నిలిచి స్వయం ఉపాధి కల్పించింది. పెళ్లి అనేది ఆమె దృష్టిలో ఇద్దరు కలిసి అన్యోన్యంగా ఒకరికి ఒకరు తోడుగా కలిసి బ్రతకడం రెండు ఆత్మలు ఒకటే అవడం అంతేకానీ బేరసారాల ద్వారా దగ్గర అవడం కాదు. ఆడపిల్లను హిందూ ధర్మం లో లక్ష్మీదేవితో పోలుస్తారు అటువంటి ఆడపిల్లను సగౌరవంగా కోడలిగా తీసుకెళ్లాల్సిన వారు వరకట్నం అడగటం ఏమిటని ఆమెకు అనిపించింది.



వెనువెంటనే వరకట్నం నిషేధిస్తూ ఒక శాసనం చేస్తూ తన సందేశం ప్రజలందరికీ చేరేలా ప్రకటించుమని ఆదేశాలు ఇచ్చింది. ఏ కులం వారైనా ఏ మతం వారైనా వరకట్నం ఇచ్చిన,పుచ్చుకున్నా నేరమవుతుందని ఆ శాసనంలో పేర్కొంది. వరకట్నం పుచ్చుకున్న వాళ్ళు పుచ్చుకున్న దానికి రెట్టింపు మొత్తాన్ని ,ఇచ్చినవాళ్లు ఎంత ఇస్తే అంతే మొత్తాన్ని ,ఎవరైనా మధ్యవర్తులు ఉంటే వారు ఎంత పుచ్చుకుంటే అంత మొత్తాన్ని హెూల్కర్ల కార్యాలయానికి చేర్చాలని శాసనం చేసింది. అహల్యా దేవి ఒక పూర్తి మహిళా సైనిక దళాన్ని నిర్మించింది.50 మంది మెరికల్లాంటి యువతులను ఎంపిక చేసి వారికి సైనిక శిక్షణ ఇప్పించింది. ఇది చరిత్రలో ఒక అరుదైన ఘట్టం. మహిళలు సైనిక దుస్తులు ధరించి కత్తులు ,ధనుర్బాణాలు, ఈటెలు చేపట్టి పురుష సైనికులతో సమానంగా క్షేత్ర తేజాన్ని ప్రదర్శించడానికి సిద్ధమవుటం ఒక అద్భుతమైన కాలంగా చెప్పవచ్చు. 70 వేల మంది సైనికులు అహల్యా దేవి కోసం పోరాడేందుకు సిద్ధమయ్యారు. అహల్యా దేవి శక్తి సామర్థ్యాలను తక్కువ అంచన వేశామని ఆమె తేలికగా లొంగిపోయే మహిళ కాదని అనుకోని ప్రమాదం ఎదురైనా ,అసమాన ధైర్యంతో ఎదుర్కోగల మహిళని ఆమె జోలికి వెళ్లడం వృధా ప్రయాసని అనవసరంగా రక్తం చిందించడమే తప్ప మరేమీ ఉండదని ఆనాటి కుట్ర దారులు గ్రహించారు. యుద్ధాలు, రాజకీయాలు సంధులు గెలుపు ఓటములు ధైర్య సాహసాలు పట్టువిడుపుల గురించి చర్చలు పాలనకు సంబంధించిన లోతైన అవగాహనను ఇస్తాయని ఆమెకు తెలిసిన ఒక గొప్ప తంత్రం.విశాల భారత దేశ చరిత్ర పటంలో ఏ మూల ఏ ప్రాంతం ఉందో , ఏ నది ఎక్కడ మలుపు తిరిగి ఇటు నుండి ఎటువైపు ప్రవహిస్తుందో, ఏ కొండకు గుట్టకు ఎంత ప్రాముఖ్యం ఉందో ఎవరెవరు ఏ ప్రాంతాలను పాలిస్తున్నారో ఆమెకు కొట్టినపిండి.దేశ చిత్రపటాన్ని ఆమె తన మనసులో నే లిఖించుకొన్నది. మరాఠా సామ్రాజ్యపుటెల్లలు, బీదర్ ,విదర్భ,ఢిల్లీ ఉత్తరాది ప్రాంతాలు నిజాంపాలన క్రింద ఉన్న ప్రాంతాలు ఇవన్నీ ఆమెకు తెలుసు. భారతదేశంలోని ప్రతి చిన్న ప్రదేశం గురించి కూడా క్షుణ్ణంగా తెలుసుకోవాలని అభిలాష ఉండేది.ఇండోర్ కు 90 మైళ్ల దూరంలో నర్మదా నది ఒడ్డున ఉన్న మహేశ్వర్ పట్టణానికి అహల్యాదేవి తన మకాం మార్చుకోవాలని అనుకుంది.ఆధ్యాత్మికత వెల్లువిరిసే మహేశ్వర్ పట్టణంలో నర్మదా నది ఒడ్డున రాజరాజేశ్వర మహాదేవ ఆలయం ఉంది.పవిత్రమైన నర్మదా నదిలో ప్రతి రాయికి శివలింగానికి ఉండేటంత విశిష్టత ఉంది.

అహల్యాదేవి గొప్ప శివ భక్తురాలు. మహేశ్వర్ ప్రజలు తమకు ప్రియమైన మహారాణి తమ పట్టణాన్ని తన నివాసంగా చేసుకున్నందుకు ఎంతో సంతోషించారు. కొంత కాలంలోనే ఒక విశాలమైన నిరంబడరమైన [illegible] అహల్యా దేవి దర్బార్ ప్రారంభం అయ్యింది. ఇండోర్ కంటే మహేశ్వర్ రాజధానిగా ఉండటానికి తగినదిగా భావించింది. ఎందుకంటే మహేశ్వర్ ఒక వైపు మరాఠాలు జయించిన భూభాగాలు ఉన్నాయి. మరొకవైపు ఇండోర్ ఉంది. ఇండోర్ లో హెూల్కర్ల సైనిక స్థావరం ఉంది.ఇంకొక కారణం మహేశ్వర్ లో అడుగడుగునా తొణికిసలాడే ఆధ్యాత్మిక. అడుగుపెట్టగానే ఆమెకు ఒక తెలియని మానసిక ప్రశాంతత కలిగేది.అహల్యాదేవి కి ఆ రాజ్యాన్ని సంరక్షించే శక్తి, సామర్థ్యాలు పుష్కలంగా ఉన్నాయని ప్రాంత ప్రజలందరికీ ఒక గట్టి ధీమా. అహల్యాదేవి మద్దతు కారణంగా వ్యాపార వాణిజ్యాలు మహేశ్వర్ పట్టణంలో వర్ధిల్లాయి. మహేశ్వర్ సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆమె నిరంతరం సంకల్పించేది. హెూల్కర్ల ధీరత్వానికి కణాచీగా సాంస్కృతిక వికాస కేంద్రంగా కూడా విలసిల్లాలనేది ఆమె అభిలాష. ఇతర ప్రాంతాల నుండి ఆయా రంగాల నుండి నిష్ణాతులైన వారిని ఆహ్వానించాలని ఆదేశాలు ఇచ్చేవారు .ప్రముఖ వైద్యులు, తత్వశాస్త్ర వేత్తలకు, శిల్పులకు, మేధావులకు జ్యోతిషవేత్తలకు, కవులకు, రచయితలకు ,విజ్ఞాన శాస్త్ర పరిశోధకులకు తగిన రీతిలో ఆహ్వాన పత్రాలు వ్రాసి మహేశ్వర్ ను తమ ఆవాసంగా చేసుకోమని విజ్ఞప్తి చేసింది. అదే విధంగా రైతుల క్షేమానికి కూడా అనేక కార్యక్రమాలు చేపట్టారు. రైతులకు అనుకూలంగా ప్రత్యేక చట్టాలు చేసి కరువు కాటకాలు వంటి అసాధారణ పరిస్థితి రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టింది.మామిడి, నిమ్మ ,చింత, రావి, మర్రి, అత్తి చెట్ల పెంపకానికి శాస్త్రీయ పద్ధతులు అవలంభించింది. తద్వారా భూగర్భ జలాల స్థాయిని పెంచి పేద రైతులకు భూములు ఇచ్చింది. రైతులు తమ ఆదాయం పెంచుకోవడానికి వీలుగా దేశంలో ఎక్కడైనా ఉత్పత్తులు అమ్ముకోవడానికి స్వేచ్ఛనిచ్చింది. పర్యటకులకు సహాయకులుగా భిల్లులు పనిచేయాలని తీర్థయాత్రలకు వచ్చేవారిని నదులు దాటించటం, దేవాలయాలకు తీసుకెళ్లడం వారి బాధ్యతని, అందుకుగాను వారు పర్యాటకులు, యాత్రికుల నుండి కొంత రుసుము వసూలు చేసుకోవచ్చని ప్రకటించింది .భిల్లుల నాయకులకు నాయక్ అనే బిరుదును ప్రసాదించింది. వారిని అధికారికంగా గుర్తిస్తూ ఎప్పటికప్పుడు సిద్ధం చేసిన నియామక పత్రాలపై రాజముద్ర వేసి సాగు చేసుకోవడానికి భిల్లులకు భూములు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. నిష్పాక్షికతకు మారుపేరే రాణి అహల్యా బాయి.ప్రజల అనేక వివాదాలను పరిష్కరించిన మంచి తీర్పారి. న్యాయనిర్ణేత.ప్రలోభాలకు లోంగేది కాదు.పక్షపాత బుద్ధి ఆమెకు ఉండేది కాదు. తమ రాణి గారి మీద ఆమె ప్రజలకు అపారమైన విశ్వాసం. ప్రతిరోజు ఒక నిర్ణీత సమయంలో ఆమె న్యాయదేవత పాత్రలో ఇమిడిపోయేది. విశాల భారతదేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆలోచించేది. ఇరుగుపొరుగు రాజ్యాలతో అప్పుడప్పుడు కయ్యాలు వచ్చినా , ఆమెకు ఎవరి పట్ల శాశ్వత శత్రుత్వం లేదు. దేశంలోనే రాజులందరూ కలిసికట్టుగా పనిచేస్తే దేశం సర్వతోముఖాభివృద్ధి అవుతుందని ఆమె ఆశించేవారు. ఐకమత్యంతో కలిసి మెలిసి ఉండటం జాతి క్షేమం,మనుగడ, అభివృద్ధి దృష్ట్యా అవసరమని ఆమె అందరితో అనేవారు.హిందూ రాజులు ,చక్రవర్తులు పగలు, స్వార్థలతో రగులుతూ పరస్పరం దాడులు చేసుకోవడం ఆమెకు నచ్చేది కాదు. హిందువులలో ఐక్యతను సాధించడం మీద ఆమె దృష్టి పెట్టారు.హిందూ ఐక్యత వల్లనే దేశం సుభిక్షంగా మారగలదని ఆమె విశ్వాసం. హిందూ దేవాలయాలను నేలమట్టం చేసిన సందర్భాలు దృష్టికి వచ్చినప్పుడు ఆమె చాలా బాధపడేవారు. హిందువులకు ఎంతో పవిత్రమైన దేవాలయాలను కూల్చడం వెనుక ఉన్న దురుద్ధేశాన్ని ప్రశ్నించేవారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు అయిన బద్రీనాథ్ ,కేదార్నాథ్, యమునోత్రి,గంగోత్రిలలో అహల్యా దేవి ధర్మసత్రాలు కట్టించారు. యాత్రికులకు వసతి కల్పించారు. జ్యోతిర్లింగాలను పునః ప్రతిష్ట చేశారు. శ్రీశైలం మల్లికార్జున, శ్రీ వైద్యనాథ, శ్రీ కాశీ విశ్వనాథ మందిరాలను నిర్మించారు.రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వ్యవస్థపకులు అయినా డాక్టర్జీ గ్రామమైన కందుకూర్ జిల్లాలో శివాలయాన్ని నిర్మించింది. శ్రీ సోమనాథ్ ,శ్రీ ఓంకారేశ్వర ఆలయాలలో మూర్తి ప్రతిష్ఠలు చేశారు.బద్రీనాథ్, ద్వారకా, రామేశ్వర్,జగన్నాధపురిల లో ధర్మశాలలు నిర్మించారు. అయోధ్య, మధుర ,హరిద్వార్ కాశీ కాంచీ,అవంతికా వంటి ఆధ్యాత్మిక నగరాల్లో తీర్థయాత్రలకు సౌకర్యాలు కల్పించారు. మహారాష్ట్ర మాల్వా ప్రాంతంలో బావులు, ఘాట్ లు, ధర్మసత్రాలు మొదలైన వాటిని అభివృద్ధి చేశారు. వందకు పైగా దేవాలయాలు నిర్మించారు. పాదాచారులకు ఎండాకాలంలో చల్లని నీరు, శీతకాలంలో వేడి నీరు త్రాగటానికి అందించే ఏర్పాటు చేశారు. 1767 సంవత్సరం నుండి 1795 వరకు ఇండోర్ రాజ్యాన్ని పరిపాలించిన ఆమె భారత దేశంలో గొప్ప గొప్ప వారి ఘనమైన గుణాలను పుణికి పుచ్చుకొంది.ఛత్రపతి శివాజీ మహారాజ్, శంకరాచార్యులలో ఉన్న విశాలా దృష్టి, ఆర్య చాణక్యుని పాలనా దౌత్య నీతులు సమర్ధ రామదాసు సంత్ జ్ఞానేశ్వర్ జీ దివ్యత్వాల మేలుకలయికగా అహల్యా దేవి నిలిచారు.ప్రజా సమస్యల పట్ల సానుభూతి, అవగాహన ఉన్న ఒక కరుణాత్మకమైన నాయకత్వానికి ఉదాహరణగా చెప్పవచ్చు.దిలీపుడు, జనకుడు ధర్మరాజులలో ఉన్న అనేక సద్గుణాలు ఈ ధీరవనితలో కనిపిస్తాయి. ప్రపంచంలోని అనేక దేశాలను, ఆ దేశాలను పరిపాలించిన పాలకులను వారి పాలనా తీరుతెన్నులను పరిశీలించిన తర్వాత అహల్యాదేవి ఏకైక స్ఫూర్తిదాయక పరిపాలకురాలని మనకు నిశ్చయంగా తెలుస్తుంది. అహల్యా బాయి పాలన శాంతి, సౌభాగ్యాలకు, సుస్థిరత్వానికి నిలయమైన భారత దేశ చరిత్రకు వన్నె చిన్నెలు అద్ది తరతరాలకు స్ఫూర్తిదాయకమై నిలుస్తుంది. 13 ఆగస్టు 1795లో ఆమె ఆత్మ పరమశివునిలో లీనమైంది.నేటి తరం వనితలకు అహల్యాబాయి ఒక గొప్ప నైన స్ఫూర్తి ప్రదాత. భారతదేశ చరిత్రలోనే ఒక శక్తివంతమైన మహిళా మణి రాణి అహల్యా బాయి హెూల్కర్.ఆమె అకుంఠిత దీక్ష, కర్తవ నిర్వహణ దూర దృష్టి సాటిలేని తన 33 ఏళ్ల పాలనలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని హిందుత్వం కోసం నిలబడ్డ ధీశాలి. నేటితరం వనితలకు, మహిళలోకానికి అహల్యా బాయి జీవితం ఒక గొప్ప నైన ఆదర్శనీయం, ఆమె వ్యక్తిత్వం ఆచరణీయం.అహల్యా బాయి హెూల్కర్ త్రి శతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రచురించగలరని మనవి.

-వంశీకృష్ణ గౌడ్ బండి
రంగయ్యపల్లి, రేగొండ జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9550837962